



నగదు ఉంది.. నామినీలు లేరు

- రాష్ట్రంలో మనుగడలో లేని 1.18 కోట్ల బ్యాంకు ఖాతాలు
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడి
- వారసుల కోసం ఎదురుచూపు
- మూలుగుతున్న రూ.3,400 కోట్లు
- ప్రత్యేక ప్రచారం చేపట్టిన అధికారులు

బెంగళూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో అప్పు చేస్తే వెంటబడి అయినా వసూలు చేస్తారు. కొన్ని బ్యాంకులు వసూళ్లకు ఏజెంట్లను నియమించుకుని మరీ ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నారు. అంటే బ్యాంకులో రుణం తీసుకుంటే చెల్లించకుండా తప్పించుకునే పరిస్థితి ఉండదు. కానీ బ్యాంకులో డిపాజిట్‌లు, సేవింగ్స్‌బ్యాంకు వంటి ఖాతాల్లో డబ్బు నిల్వ ఉంచి ఆకస్మికంగా మరణించినా, నామినీ నమోదు చేయని ఖాతాలు నిరుపయోగంగా మిగిలిపోయాయి. రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలో నిష్క్రియంగా మిగిలిపోయిన 1,18,35,153 బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు ప్రకటించింది. సదరు ఖాతాల్లో రూ.3,400 కోట్లు డిపాజిట్ల రూపంలో ఉన్నట్లు గుర్తించింది. ఆ ఖాతాలను ఏడాదిలోగా వారసుదారులకు అప్పగించే ప్రక్రియ ముగించాలని ఆర్‌బీఐ వివిధ బ్యాంకుల ముఖ్యులకు సూచించింది. ఈ మొత్తాన్ని డిపాజిట్‌దారుల వారసులకు అప్పగించాల్సి ఉంది. మీ సొమ్ము మీ హక్కు పేరిట అన్నిబ్యాంకులలోనూ చైతన్యం కలిగించాలని సూచించింది. ప్రతిబ్యాంకులో ఇటువంటి డిపాజిట్ ఖాతాలు ఉన్నాయి, వాటికి సంబంధించిన ఆధారాలు, డిపాజిట్‌దారుడి సమీప బంధువులు ఎవరు ఉన్నారనే కోణంలో పరిశీలించాలని సూచించింది. అక్టోబరులో ప్రక్రియ ప్రారంభించారు. తద్వారా 12,58,800 ఖాతాలకు చెందిన వారసుదారులకు సొమ్ము అప్పగించే ప్రక్రియకు లైన్ క్లియర్ అయ్యింది. తద్వారా 10.63 శాతం ఇన్‌యాక్టివ్ అకౌంట్ల నుంచి వారసుదారులకు సొమ్ము చేరేందుకు వీలు కల్పించినట్లయ్యింది. 'మీ సొమ్ము మీ హక్కు' అనే కార్యక్రమం పట్ల ప్రజల్లో చైతన్యం కలిగిస్తోన్నారు. దావణగెరె జిల్లాలో సోమవారం ఏకంగా 443 ఖాతాలను గుర్తించారు. వాటి ద్వారా 1.15 కోట్ల రూపాయలు వారసులకు అప్పగించారు. ఓ ఖాతాదారుడు పదేళ్లుగా ఖాతాలో డబ్బులు లేవని వదిలిపెట్టారు. కాగా నిష్క్రియమైన ఖాతాల అన్వేషణలో భాగంగా కేవైసీ కోరిన మేరకు దావణగెరెకు చెందిన వారు ఒక్కొక్కరిగా బయటకు వచ్చారు. జిల్లా అధికారి ద్వారా వారి ఖాతాలతోపాటు వారి పూర్వీకులకు సంబంధించి ఎటువంటి లావాదేవీలులేక ఆగిపోయిన ఖాతాలనుంచి డబ్బు పొందామని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

క్లియరెన్స్ మేళా చేపట్టిన బ్యాంకులు

ఖాతాదారులు లేనిపక్షంలో చట్టబద్ధంగా వారసుదారులైనవారు కేవైసీ రికార్డులను బ్యాంకుకు అందజేస్తే నిష్క్రియమైన వారి అనుబంధ ఖాతాల వివరాలను క్రోడీకరించుకుని నిబంధనల ప్రకారం సొమ్ము వాపసు చేయాలని నిర్ణయించారు. ఇటీవల బ్యాంకుల వద్ద ఇదే ప్రధానమైన అంశంగా మారిపోయింది. ప్రతిబ్యాంకులోనూ ఇటువంటి ఖాతాలను క్లియర్ చేయాలని భావిస్తున్న బ్యాంకర్లు అందుకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో పేర్ల ప్రకారం పట్టణ, నగరాల్లో వారు నివసించిన ప్రాంతాలలో ఆరా తీస్తున్నారు. ఇలా బ్యాంకర్లు కేవలం వారి ప్రచారంతోనే సరిపెట్టుకోకుండా స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు ఇతరత్రా ఉద్యోగుల ద్వారాను ప్రచారం చేయిస్తున్నారు. రాష్ట్రంలో నిష్క్రియంగా కొన్నేళ్లకాలంగా రికార్డులకే పరిమితంగా కొనసాగుతున్న ఖాతాలనుంచి వారసులకు అనుకోకుండా సొమ్ము చేరుతోంది. కనీసం మా కుటుంబ సభ్యులకు బ్యాంకు ఖాతాలు ఉన్నాయనే వివరాలు కూడా తెలియనివారికి వేల నుంచి లక్షలాది రూపాయలు అందుతోంది.



పోర్టల్ (వెబ్‌సైట్)ల ద్వారా కూడా అనుకూలం అవుతోంది. నిష్క్రియమైన బ్యాంకు ఖాతాల వివరాలను వెబ్‌సైట్‌ల ద్వారాను ఆరా తీసే వెసలుబాటు ఉంది. వీటి కోసం బ్యాంకులు ప్రత్యేక మేళాలు నిర్వహిస్తున్నాయి.

బెంగళూరులోనే రూ.1200 కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా నిష్క్రియంగా మారిన బ్యాంకు ఖాతాల్లో రూ.3,400 కోట్లు ఉండగా కేవలం బెంగళూరు నగర పరిధిలో 29,70,139 ఖాతాల్లో రూ.1,200 కోట్లు మేర డిపాజిట్లు ఉన్నట్లు తెలుస్తోంది. బెళగావిలో రూ.175 కోట్లు, దక్షిణకన్నడలో 142 కోట్లు, దావణగెరెలో రూ.61 ఉండగా మిగిలిన జిల్లాల పరిధిలో రూ.50కోట్లకు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలవారీగా నిష్క్రియఖాతాల్లో బెంగళూరు నగరలో 29,70,139, బాగల్కోట 2,55,573, బళ్ళారిలో 2,70,484 బెళగావిలో 6,80,267, బెంగళూరు గ్రామీణ 2,16,806, బీదర్‌లో 2,11,539, చామరాజనగర 1,21,882, చిక్కబళ్ళాపుర 2,15,344, చిక్కమగళూరులో 2,33,747, చిత్రదుర్గలో 3,19,028, దక్షిణకన్నడలో 6,46,996, దావణగెరె 2,67,508, ధారవాడలో 2,98,928, గదగ్‌లో 1,26,116, హాసన్ 3,24,436, హావేరిలో 1,55,001, కలబురగిలో 3,79,783, కొడగులో 1,41,058, కోలారులో 2,89,441, కొప్పళలో 2,59,476, మండ్యలో 2,49,248, మైసూరులో 5,05,424, రాయచూరులో 3,65,981, బెంగళూరు దక్షిణ 1,66,779, శివమొగ్గలో 3,66,247, తుమకూరులో 4,11,477, ఉడుపిలో 4,03,270, ఉత్తరకన్నడలో 3,16,465, విజయనగరలో 2,00,185, విజయపురలో 3,14,490, యాదగిరిలో 1,49,035 ఉన్నాయి. ఇలా ఆయాజిల్లాల్లో రూ.కోట్ల నిధులు మూలుగు తున్నాయిని లెక్కలు చెబుతున్నాయి.

చెరకు రైతుల నిరసనలపై

కేబినెట్‌లో చర్చ

- ముఖ్యమంత్రి నిర్ణయమే శిరోధార్యమన్న మంత్రులు
- నేడు ఫ్యాక్టరీ యజమానులతో సీఎం సమావేశం
- ప్రధాని అపాయింట్‌మెంట్ కోరతా : సిద్దరామయ్య



బెంగళూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బెళగావి, బాగల్‌కోటెతో పాటు పలు జిల్లాలలో సాగుతున్న చెరకు రైతు సమస్యలపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. సాధారణంగా గంట నుంచి రెండు గంటల లోపే ఎన్ని అంశాలు ఉన్నా తీర్మానాలు జరిగేవి. కానీ చెరకు రైతులు చేపట్టిన నిరసనలు 8వ రోజుకుచేరడంతో పాటు ఓ రైతు ఆత్మహత్యాయత్నం, శుక్రవారం బెళగావి బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో సుమారు 3గంటలకుపైగా సభ జరిగింది. చెరకు రైతులు టన్నుకు రూ.3550లు చెల్లించాలనే ఏకైక డిమాండ్‌తో నిరసనలు చేస్తున్నారు. ప్రధానంగా బెళగావిలో 28 పరిశ్రమల ద్వారా లక్షలాది మంది రైతులకు అన్యాయం జరుగుతోందనేది రైతుల వాదనగా ఉంది. చెరుకును ఫ్యాక్టరీలకు వేయడం ద్వారా చక్కెరతో పాటు మొలాసిస్, ఎథనాల్, విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతోందని రైతు సంఘాత ప్రతినిధులు డిమాండ్ చేస్తున్న అంశాన్ని చెరుకుశాఖా మంత్రి శివానందపాటిల్ తెలిపారు. ఇదే సందర్భంలోనే మంత్రి హెచ్‌కే పాటిల్ మాట్లాడుతూ రైతులతో పాటు రైతుసంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు వెళ్ళిన సందర్భంలోను పట్టువీడని రీతిలో వ్యవహరించారని వివరించారు. మంత్రులందరూ మీ నిర్ణయమే శిరోధార్యమని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు తేల్చి చెప్పారు. చివరగా శుక్రవారం విధానసౌధలో చెరకు ఫ్యాక్టరీల యజమానులతో సభ జరపాలని తీర్మానించారు. దీంతో 82 ఫ్యాక్టరీల యజమానులకు ప్రత్యేక సందేశాలు పంపారు. విధానసౌధలో జరిగే సభకు అందరూ హాజరు కావాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు పంపారు. సభలో ఎటువంటి తీర్మానాలు చేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. కాగా బెళగావి జిల్లాలో ప్రారంభమైన నిరసన ప్రస్తుతానికి ఐదు జిల్లాలకు విస్తరించింది. ఆందోళనలు ఉధృతమైతే తీవ్ర సమస్యలు తలెత్తుతాయని ప్రభుత్వం యోచిస్తోంది.

ప్రధాని మోదీతో చర్చిస్తా : సీఎం

చెరకు రైతులకు సంబంధించి చర్చలు జరిపేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అపాయింట్‌మెంట్ కోరుతానని సీఎం సిద్దరామయ్య తెలిపారు. మంత్రివర్గ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి విధానసౌధలో మీడియాతో మాట్లాడారు. చెరకు రైతుల సమస్యలపైనే ప్రధానితో చర్చించదలచానన్నారు. శుక్రవారం ఫ్యాక్టరీల యజమానులతో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం దాకా చర్చలు జరుపదలచానన్నారు. వారి అభిప్రాయాలు సేకరించాక ప్రభుత్వం ద్వారా ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.

నీటి నాణ్యతకు జాతీయస్థాయిలో ఒకే పాలసీ

- నీతి ఆయోగ్ సభ్యుడు వినోద్ కె పాల్

బెంగళూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సంస్కరించిన నీటి నాణ్యత విషయంలో జాతీయ స్థాయిలో ఒకే పాలసీని తీసుకురాదలచినట్లు నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వినోద్ కె పాల్ అన్నారు. జలమండలి ఏర్పాటు చేసిన 'భారత్‌లో సంస్కరించిన నీటి పునర్వినియోగం' అంశంపై రెండురోజుల చర్చాగోష్ఠిని ఆయన గురువారం ప్రారంభించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రజనీష్‌లతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా సంస్కరించబడిన నీటిని వినియోగంలో ఒక పాలసీను తీసుకువస్తామన్నారు. ప్రస్తుతం 11 రాష్ట్రాల్లో ఇటువంటి నీటిని వినియోగించుకునే పాలసీని పాటిస్తున్నారన్నారు. నీరు జీవనంలో ఒక భాగం మాత్రమే కాదని నీరు ఉంటేనే జీవనమనేది కూడా ప్రజలలో అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. నగరాభివృద్ధిశాఖ అదనపు ముఖ్య కార్యదర్శి తుషార్‌గిరినాథ్, జలమండలి చైర్మన్ రాంప్రసాత్ మనోహర్‌తో పాటు పలువురు ముఖ్య అధికారులు భాగస్వామ్యులయ్యారు.



నీటి యంత్రాలను పరిశీలిస్తున్న చీఫ్ సెక్రటరీ శాలినీ రజనీష్

అంతరిక్ష, రక్షణ రంగంలో దేశీయ ప్రగతి అద్భుతం

- 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచానికి సత్తా చాటాం: 'కాన్' ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి
- ఆకట్టుకున్న రక్షణ రంగ ప్రదర్శన

బెంగళూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అంతరిక్ష పరిశోధనలు, రక్షణరంగంలో ఆవిష్కరణల్లో దేశీయ ప్రగతి అద్భుతమని, ప్రపంచదేశాలు భారత్‌వైపు చూసేలా ఉన్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి ప్రహ్లాద్‌జోషి అన్నారు. ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ సర్వీస్(ఐఎంఎస్) కాన్ పేరుతో బెంగళూరులోని అంతర్జాతీయ ప్రదర్శనల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను గురువారం ఆయన లాంచనంగా ప్రారంభించారు. కేంద్రమంత్రి శోభాకరంద్లాజె సహా విభిన్న పరిశ్రమల ప్రముఖులు భాగస్వామ్యులయ్యారు. ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ మాట్లాడుతూ ఇస్రో చేస్తున్న అన్ని ప్రయోగాలకు అవసరమైన పరికరాలు 85శాతం దేశీయ పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈ, స్టార్‌యాప్‌ల నుంచే సమకూర్చుకోవడం గర్వకారణమన్నారు. అంతరిక్ష పరిశోధనల సాధనల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని ప్రపంచదేశాలకు ఆదర్శంగా ఉన్నామన్నారు. డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ మాట్లాడుతూ ఆత్మనిర్భర భారత్ మారుతున్న సాంకేతికతలో నాయకత్వానికి దేశీయ పరిజ్ఞానమే కారణమన్నారు. రక్షణ వ్యవస్థలో ఎగుమతులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో పలు దేశీయ వ్యవస్థలు అసాధారణంగా, ఉత్తమంగా పనిచేస్తున్నాయని నిరూపించామన్నారు. భారత్ ఫోర్జ్ సీఎండీ బాబా కల్యాణి డాక్టర్ కామత్ ముఖ్యంగా పాల్గొన్నారు. 15వేల మంది పారిశ్రామికవేత్తలతో కూడిన ఐఎంఎస్ ఫౌండేషన్ కర్ణాటక చాప్టర్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రత్యేక సందేశం పంపారు. వివిధ దేశాలకు చెందిన పారిశ్రామిక దిగ్గజ కంపెనీల ప్రదర్శనలు సాగాయి.



సదస్సును ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి







రక్షణ రంగానికి చెందిన ఉత్పత్తులను తిలకిస్తున్న విద్యార్థులు

భక్తుల కొంగుబంగారం ముక్తినాగ ఆలయం

- కార్తీక మాసం సందర్భంగా భక్తులతో కిటకిట
- ఏడాదిలో మూడు షష్టి వేడుకలు ఇక్కడి ప్రత్యేకం
- 24 అడుగుల సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

బెంగళూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర శివారు మాగడి రోడ్డు రామోహళ్ళికి అనుబంధంగా వెలసిన ముక్తినాగ ఆలయం భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. 2001లో నగరంలో అధ్యాపకుడిగా కొనసాగుతున్న సుబ్రమణ్యశాస్త్రి సంకల్పం తోనే ఆలయనిర్మాణం విజయవంతంగా పూర్తయ్యింది. ఎక్కడ ఆలయం నిర్మించాలనే ఆలోచనతో వెళ్ళిన అధ్యాపకుడు ప్రస్తుతం గుడి ఉండే ప్రదేశానికి వచ్చి పరిశీలించగా 12.6 అడుగుల పాము కుబుసం గుర్తించారు. అక్కడే ఆలయం నిర్మించాలని తీర్మానించారు. ఇలా రెండేళ్లపాటు కొనసాగిన నిర్మాణ పనులతో 2003లో ముక్తినాగ ఆలయాన్ని నిర్మించి భక్తుల దర్శనానికి వీలు కల్పించారు. మూడు అడుగుల పీఠం, 12 అడుగుల నాగవిగ్రహంతో కలిపి 16 అడుగుల ప్రత్యేకతగా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడి ఆలయంలో ముక్తినాగ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. 2005లో కుంభాభిషేకం బ్రహ్మాండంగా జరిగింది. ప్రస్తుతం ధర్మకర్తగా సుబ్రమణ్యశాస్త్రి భార్య గౌరమ్మ వ్యవహరిస్తున్నారు. ఇక్కడ 12.5 ఎకరాల విస్తీర్ణంలో ఆలయం ఏర్పాటైంది. ఇటీవలే రాజగోపురంతోపాటు మహామండపం నిర్మించారు. ధర్మకర్త వంశపారంపర్యంగా వచ్చిన ఆయుర్వేద వైద్యం, జ్యోతిష్యం వంటివి జరుపుతుంటారు. ఆలయంలో ప్రతిరోజూ పూజలు కొనసాగుతాయి. ప్రధానంగా ఏడాదిలో మూడు షష్టి వేడుకలు ప్రత్యేక పూజలతో చేస్తారు. మార్గశిర మాసం సుబ్రమణ్యషష్టి, పుష్యమాసంలో తులనాడు ప్రాంత వాసులు జరిపే షష్టివేడుకలు జరుపుతారు. మాఘమాసంలో కుమారషష్టి జరుపుతారు. ఇలా సుబ్రమణ్య షష్టి వేడుకల వేళ జాతర ఉంటుందని ప్రధాన అర్చకులు గణపతి శర్మ తెలిపారు. ఇక్కడ సర్పదోష పరిహారం, సర్పసంస్కారం, కాలసర్పశాంతితోపాటు నాగప్రతిష్ఠ, ఆశ్లేషబలి, దశసంధిశాంతి వంటివి ప్రత్యేక పూజలు నిర్వహించే సంప్రదాయం ఉన్నట్లు తెలిపారు. ఆలయానికి సమీపంలో 24 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు వారు తెలిపారు. మరి కొన్ని నెలల్లోనే కార్యక్రమం ఉంటుందన్నారు. ఇది బెంగళూరుతోపాటు ఈ ప్రాంతంలోనే ప్రత్యేక ఆకర్షణీయ అత్యంత ఎత్తైన విగ్రహం కానుందని తెలిపారు.



అలంకరణలో మూలవిరాట్టు



ఆలయ ప్రవేశద్వారం



రాజగోపురం

పెళ్లి పిలుపు పేరుతో దోపిడీ

- వివాహపత్రికలు ఇచ్చేవారిలా వచ్చి దారుణం
- మహిళను బెదిరించి బంగారం, నగదుతో పరారు

బెంగళూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దొంగతనాలు చేసేవారు ఇప్పటి దాకా ఇళ్లు అద్దెకు కావాలని, తెలిసిన వారికోసం వెతుకుతూ వచ్చామని మెడలో గొలుసులు చోరీ చేసిన సంఘటనలు ఉన్నాయి. బెంగళూరు శివారులోని ఆనేకల్ తాలూకాలో పెళ్లిపత్రికలు ఇచ్చేవారిలా ఇంట్లో ప్రవేశించి దోపిడీ చేసిన సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. నెరళూరు గ్రామంలో రవికుమార్, నాగవేణి దంపతులు నివసిస్తున్నారు. బుధవారం రవికుమార్ డ్యూటీకి వెళ్లిన సమయం చూసుకున్న ఓ ముఠా చాకచక్యంగా దొంగతనం చేశారు. ఇంట్లో రవికుమార్ భార్య నాగవేణి ఒక్కరే ఉన్న సమయంలో ఓ మహిళ పెళ్లి పత్రిక కార్డుతో ఇంట్లోకి ప్రవేశించింది. తాము రవికుమార్ బంధువులమంటూ మాట కలిపింది. తాగేందుకు నీళ్ళు ఇవ్వాలని కోరారు. ఆమె వంటింట్లోకి వెళ్లగానే నలుగురైదుగురు పురుషులు ఒక్కసారిగా ఇంట్లోకి ప్రవేశించారు. ఒక్కసారిగా నాగవేణిని చుట్టుముట్టి నోరు మూసేసుకుని ఓ గదిలో బంధించారు. చాకుతో పొడుస్తామంటూ బెదిరించి ఇంట్లోని బీరువా తాళాలు తీసుకుని బంగారు ఆభరణాలు, నగదు, ఇతరత్రా విలువైన వస్తువులను దోచుకున్నారు. నాగవేణిను గదిలోనే ఉంచి బయట తలుపులు మూసేసి వెళ్లిపోయారు. కాసేపటికి నాగవేణి మిత్రులకు ఫోన్ చేసి విషయం తెలిపింది. బాధిత దంపతుల ఫిర్యాదు మేరకు బెంగళూరు గ్రామీణ అడిషనల్ ఎస్పీ వెంకటేష్ ప్రసన్న సంఘటన జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్న అత్తిబెలె పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

అనాథలకు అమ్మా నాన్నలా..



నామకరణం నిర్వహిస్తున్న అధికారులు

శాస్త్రోక్తంగా నామకరణం నిర్వహించిన అధికారులు

9

యాప్ ద్వారానే మద్యం అమ్మాలి

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు, బార్లలో సురక్ష యాప్ ద్వారానే మద్యం అమ్మాలని, యాప్ వాడకుండా ఒక్క బాటిల్ అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఉమ్మడి జిల్లా డీసీ నాగమద్దయ్య హెచ్చరించారు. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో గురువారం ఆయన అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎక్సైజ్ సీఐలు, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలతో సమావేశం నిర్వహించారు. మద్యం నాణ్యత కనుక్కోడానికి ప్రభుత్వం సురక్ష యాప్ తీసుకొచ్చిందన్నారు. దీన్ని ప్రతి వినియోగదారుడు వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. యాప్ వాడకుండా ఎవరూ లిక్కర్ షాపులు, బార్లలో సేల్స్ చేయకూడదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని స్టేషన్ల పరిధిలో బెల్ట్ దుకాణాలు లేకుండా నియంత్రించాలన్నారు. పల్లెల్లో నాటుసారా, కల్తీ కల్లుపై కూడా గట్టి నిఘా పెట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద్ నాయక్, అసిస్టెంట్ ఈఎస్‌లు రేవతి, నరసింహులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైస్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఇతర సీఐలు సీఐలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతుల బోరు బావులకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లా ఎస్టీ రైతులకు రూ29.72 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. బోరుబావికి విద్యుత్‌సౌకర్యం కోసం ఇప్పటికే కొందరు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సౌకర్యం అవసరమైన రైతులు ఈనెల 28లోగా అనంతపురం గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో వివరాలతో అర్జీలను అందజేయాలని డీడీ కోరారు.

రెవెన్యూ క్రీడలకు రూ.5 లక్షల విరాళం


కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న ఉమర్ ముక్తార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 7,8,9 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు టీడీపీ నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికారి ప్రతినిధి డాక్టర్ ఉమర్‌ముక్తార్ రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఉమర్ మాట్లాడుతూ ఇలాంటి క్రీడాపోటీలు అధికారుల మధ్య ఐకమత్యాన్ని, ఆరోగ్యాన్ని, సేవాభావాన్ని పెంపొందిస్తాయన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పెషల్ గ్రీవెన్స్

అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం-హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ (అహుడా) పరిధిలో సమస్యల పరిష్కారానికే స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ టీసీ వరుణ్ తెలిపారు. స్థానిక అహుడా కార్యాలయంలో గురువారం స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహించారు. అహుడా వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి అర్జీలను స్వీకరించిన అనంతరం చైర్మన్ టీసీ వరుణ్ మాట్లాడారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీలను ఇవ్వొద్దని సూచించారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, నివేదిక అందజేయాలని అహుడా అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, ఏపీఓ హరీష్‌చౌదరి, ఈఈ దుశ్యంత్, డీఈలు జ్యోతి, రేవంత్ పాల్గొన్నారు.

గుప్తనిధుల వేటగాళ్ల పట్టివేత


గుప్త నిధుల వేటకు వచ్చి దొరికిపోయిన దిలీప్ రెడ్డి, శశికుమార్, శ్రీధర్

నంబులపూలకుంట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పురాతన నరసింహ స్వామి ఆలయంలో గుప్త నిధుల తవ్వకాలకోసం వచ్చిన ముగ్గురిని స్థానికులు గురువారం రాత్రి పట్టుకున్నారు. నంబులపూలకుంట మండలం ధనియాన్‌చెరువు పంచాయతీ డి.గొల్లపల్లి సమీపంలో పురనాతన నరసింహస్వామి ఆలయం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం వద్ద రాత్రిపూట సంచరిస్తున్నట్లు రైతులు గుర్తించారు. ధనియాన్‌చెరువు, పాతూరు గ్రామాలకు ఈ సమాచారాన్ని చేరవేశారు. రెండు గ్రామాల ప్రజలు గురువారం రాత్రి ఆలయాన్ని చుట్టుముట్టారు. ఆలయం వద్ద ఒక ఆటో, ద్విచక్రవాహనం ఉన్నట్లు గుర్తించారు. గ్రామస్థుల రాకను పసిగట్టిన ముఠా పారిపోయేందుకు ప్రయత్నించిది. వీరిలో ఇద్దరిని ఆలయ సమీపంలో పట్టుకున్నారు. మరొకరిని వెంబడించి పొలాల్లో పట్టుకున్నారు. గ్రామస్థులు పట్టుబడినవారిని నిలదీయగా, తమది అన్నమయ్య జిల్లా మదనపల్లి అని, గుప్త నిధుల తవ్వకాల కోసం ఐదుగురం వచ్చామని ఒప్పుకున్నారు. పట్టుబడినవారిలో దిలీప్ రెడ్డి, శ్రీధర్, ఆటో డ్రైవర్ శశి కుమార్ ఉన్నారు. పారిపోయిన మహిళ, మరో వ్యక్తి కోసం గ్రామస్థులు పొలాలు, గుట్ట ప్రాంతాల్లో గాలిస్తున్నారు. పట్టుబడినవారిని పోలీసులకు అప్పగించారు.

నేడు ఫెన్సింగ్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఉమ్మడి జిల్లాస్థాయి ఫెన్సింగ్ సెలెక్షన్స్ బుధవారం స్థానిక కొవ్వూర్‌నగర్‌లోని విద్యారణ్య పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి పుష్పావతి ప్రకటనలో తెలిపారు. సీనియర్ బాల, బాలికల విభాగంలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఎంపికైన వారు ఈనెల 11వ తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హత గల వారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలకు 9553768 295 నంబరులో సంప్రదించాలని కోరారు.

కూటమి పాలనలో అన్నివర్గాలకు మోసం

వైసీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో అన్నివర్గాలకు మోసం జరుగుతోందని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ ఎదుట కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమానికి బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటుపరం కాకూడదన్న లక్ష్యంతోనే కోటి సంతకాల సేకరణ చేస్తున్నామన్నారు. ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు. పీపీపీ టెండర్లలో ఎవరు పాల్గొని దక్కించుకున్నా తాము అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేస్తామన్నారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... వైద్యవిద్యను, సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయడం కోసం వైసీపీ హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక తన వర్గానికి వాటిని కట్టబెట్టడానికి ప్రైవేటు పరం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, అహుడా మాజీ ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, అనంత

చెన్నై-గుంతకల్లు మధ్య ప్రత్యేక రైలు



గుంతకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చెన్నై సెంట్రల్-గుంతకల్లు మధ్య రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. చెన్నై సెంట్రల్-గుంతకల్లు (06091) ప్రత్యేక రైలు ఈ నెల 19, 21 తేదీల్లో రాత్రి 11-50 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2-15 గంటలకు గుంతకల్లుకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06092) ఈనెల 20, 22 తేదీల్లో సాయంత్రం ఐదున్నరకు గుంతకల్లులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9-45 గంటలకు చెన్నై సెంట్రల్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు పెరంబూరు, తిరువల్లూరు, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పట్టై, కుప్పం, బంగారపేట్, వైట్‌ఫీల్డ్, క్రిష్ణరాజపురం, యల్హంక, హిందూపురం, శ్రీసత్యసాయి ప్రశాంతినిలయం, ధర్మవరం, అనంతపురం, గుత్తి స్టేషన్ల మీదుగా గుంతకల్లుకు చేరుతుందన్నారు. అలాగే తిరువనంతపురం నార్త్-శ్రీసత్యసాయి నిలయం మధ్య కూడా రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. తిరువనంతపురం నార్త్-శ్రీ సత్యసాయి నిలయం (06093) ప్రత్యేక రైలు ఈ నెల 19, 21 తేదీల్లో తిరువనంతపురం నార్త్ స్టేషన్‌లో సాయంత్రం 6-05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం స్టేషన్‌కు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06094) శ్రీసత్యసాయి ప్రశాంతినిలయం స్టేషన్‌లో ఈ నెల 20, 22 తేదీల్లో రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 3-55 గంటలకు తిరువనంతపురం నార్త్ స్టేషన్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు వర్కల శివగిరి, కొల్లం, కాయంకులం, చెంగనూరు, తిరువల్ల, కొట్టాయం, ఎర్నాకులం టౌన్, అలువ, త్రిసుర్, పలక్కడ్, కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడ్, సేలం, కుప్పం, బంగారపేట్, వైట్‌ఫీల్డ్, క్రిష్ణరాజపురం, యల్హంక, హిందూపురం స్టేషన్ల మీదుగా శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం చేరుతుందన్నారు. సంత్రగాచి-యల్హంక (08073) ప్రత్యేక రైలు ఈ నెల 21, 28 తేదీల్లో మధ్యాహ్నం 2-45 గంటలకు బయలుదేరి 23, 30 తేదీల్లో తెల్లవారుజామున 12-55 గంటలకు యల్హంకకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (08074) యల్హంకలో ఈ నెల 23, 30 తేదీల్లో ఉదయం 4-45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు సంత్రగాచికి చేరుతుందన్నారు. ఈ రైలు ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, కటక్, భువనేశ్వర్, కుద్రారోడ్, బెర్హంపూర్, విజయనగరం, దువ్వాడ, విజయనగరం, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం, హిందూపురం మీదుగా యల్హంకకు చేరుకుంటుందన్నారు.

ధర్మవరం మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి బాగల్‌పూర్-యశ్వంతపూర్ మధ్య సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బాగల్‌పూర్-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (03403) ఈ నెల ఏడో తేదీ రాత్రి పదిన్నరకు బాగల్‌పూర్‌లో బయలుదేరి 9వ తేదీ రాత్రి 11-50 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (03404) ఈ నెల పదిన ఉదయం ఏడు గంటలకు యశ్వంతపూర్‌లో బయలుదేరి 12న ఉదయం ఏడున్నరకు బాగల్‌పూర్‌కు చేరుకుంటుంద న్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, డోన్, గుంటూరు, విజయవాడ, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, బరంపురం, కుర్దారోడ్, భువనేశ్వర్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్, అండుల్, భట్టానగర్, బద్రమన్, రాంపూర్హాట్, బర్హార్వా, సాహిబ్ గంజ్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

లెక్చరర్ పోస్టా.. వద్దులే..!

డైట్ లెక్చరర్ పోస్టులకు టీచర్ల విముఖత

ఏడు పోస్టులకు 15 దరఖాస్తులు, నలుగురికే అర్హత

అనంతపురం విద్య, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డైట్ (ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ)కు లెక్చరర్లుగా వెళ్లడానికి ఉపాధ్యాయులు అయిష్టత చూపుతున్నారు. బుక్కపట్నం డైట్ కళాశాలలో రెగ్యులర్ లెక్చరర్లు లేకపోవడంతో అర్హత కలిగిన ఉపాధ్యాయులను ఫారిన్ సర్వీస్ కింద తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లకు అవకాశం కల్పిస్తూ దరఖాస్తుల ను ఆహ్వానించారు. తెలుగు-2, గణితం-1, ఫైన్ ఆర్ట్స్(కళ) 1, ఫిలాసఫీ-1, సోషియల్ స్టడీస్-2 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ ఏడు పోస్టులకు కేవలం 15మంది టీచర్లు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పీజీ ఉన్నా ఎంఈడీ లేకపోవడంతో 11 దరఖాస్తులను తిరస్కరించారు. నలుగురు మాత్రమే డైట్ లెక్చరర్ పోస్టులకు అర్హత పొందారు. వారికి గురువారం నుంచి కేవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. తొలి రోజు తెలుగు సబ్జెక్టుకు సంబంధించి ఒకరు మాత్రమే హాజరయ్యారని, మిగిలిన పోస్టులకు శుక్ర, శనివారాలలో కూడా పరీక్షలు కొనసాగుతాయని డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కాగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 18వేలమంది టీచర్లు పని చేస్తున్నా అతి తక్కువ దరఖాస్తులు రావడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది. బుక్కపట్నం సుదూరంగా ఉండటం వల్లే చాలా మంది అనంతపురంలో ఉంటున్న అర్హులైన టీచర్లు దరఖాస్తు చేయలేదనే చర్చ నడుస్తోంది. అదే అనంతపురంలో డైట్ కళాశాల ఉండి, ఇవే పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి ఉంటే ఏస్థాయిలో పోటీనో, ఎన్ని సిఫార్సులు ఉండేవోనన్న అభిప్రాయాలు టీచర్ల నుంచే వినిపిస్తున్నాయి.

మా రెవెన్యూ డివిజన్లు యథాతథంగా కొనసాగించండి

రెవెన్యూ మంత్రి, కమిషనర్, శ్రీసత్యసాయి, అనంత జిల్లా కలెక్టర్లకు ఎమ్మెల్యే పరిటాల సునీత లేఖలు



అనంతపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రెండు రెవెన్యూ డివిజన్లను యథాతథంగా కొనసాగించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత.. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఆమె రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆ శాఖ కమిషనర్ జయలక్ష్మి, శ్రీసత్యసాయి, అనంత జిల్లాల కలెక్టర్లు శ్యాంప్రసాద్, ఆనంద్‌కు గురువారం వేర్వేరుగా లేఖలు రాశారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, ఒక నియోజకవర్గంలోని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలన్న అంశంపై మంత్రివర్గ ఉపసంఘం, రెవెన్యూశాఖ యోచిస్తున్న తరుణంలో రాప్తాడు నియోజకవర్గంలోని రెవెన్యూ డివిజన్లు యథాతథంగా ఉంచాలని ఆ లేఖలో ఆమె పేర్కొన్నారు. రాప్తాడు నియోజకవర్గం భౌగోళికంగా చాలా భిన్నమైన పరిస్థితుల్లో ఏర్పడిందనీ, ఆరు మండలాలు ఉండగా.. జిల్లాల పునర్విభజనలో మూడు మండలాలు అనంతపురం, మరో మూడు శ్రీసత్యసాయి జిల్లాలో చేర్చిన విషయాన్ని లేఖలో పేర్కొన్నారు. అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయన్నారు. కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి.. ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయన్నారు. భౌగోళికంగా ప్రజల అవసరాలు, పరిపాలనా సౌలభ్యం పరంగా ఇది అందిరికీ అనుకూలంగా ఉందన్నారు. ఒక నియోజకవర్గమంతా ఒక రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటున్న నేపథ్యంలో.. తన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని, తమ నియోజకవర్గ భౌగోళిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యం, పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాలను ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొస్తే ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు మండలంలోని గ్రామాల ప్రజలు అనంతపురం మీదుగా ధర్మవరం రెవెన్యూ డివిజన్‌కు వెళ్లాలంటే సుమారు 80 కి.మీ వెళ్లాల్సి ఉంటుందన్నారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధి రామగిరి మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలు, అదే తరహాలో చెన్నేకొత్తపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, గంగినేపల్లి వాసులు ధర్మవరం మీదుగా అనంతపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి రావాలంటే 85 కి.మీ ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు, విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకుని ప్రస్తుతం ఏ రెవెన్యూ డివిజన్‌లో ఏ మండలాలున్నాయో వాటిని అలాగే కొనసాగించేలా చూడాలని ఎమ్మెల్యే.. ప్రభుత్వాన్ని కోరారు.

సత్యసాయి స్ఫూర్తిని చాటేలా..

శతజయంత్యుత్సవాలు: జేసీ



పుట్టపర్తి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా స్ఫూర్తిని చాటేలా శతజయంత్యుత్సవాలను నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల నిర్వహణపై అధికారులు, సత్యసాయి ట్రస్టు సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులపై ఆరాతీశారు. జేసీ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లను చేయాలన్నారు. జిల్లా యంత్రాంగం, సత్యసాయి ట్రస్టు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వివిధ శాఖల అధికారులు, సత్యసాయి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు

పుట్టపర్తి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శుక్రవారం నుంచి ఏడాదిపాటు జిల్లావ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ గురువారం ప్రకటనలో అధికారులను ఆదేశించారు. వందేమాతరం సందేశం, ప్రాధాన్యతను ప్రతిబింబించే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించాలన్నారు.

రేపు పీఆర్ ఇంజనీర్ల సంఘం ఎన్నిక

అనంతపురం న్యూటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ (పీఆర్) ఇంజనీర్ల సంఘం ఎన్నిక ఈనెల 8న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ ఎస్ఈ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 9న శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి ఎన్నిక నిర్వహించనున్నారు. ఏకగ్రీవం చేస్తారా, ఎన్నిక నిర్వహించాల్సి వస్తుందా అన్నది తేలాల్సి ఉంది.

పట్టణంలో గంజాయి మొక్కలు


పరిశీలిస్తున్న ఏఎస్పీ

తాడిపత్రి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్‌కాలనీలో ఇళ్ల మధ్యలో రంగనాథ్ అనే వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో గంజాయి మొక్కలు ఉన్నట్లు పోలీసులు గురువారం గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తుల సమాచారం మేరకు ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, పట్టణ సీఐ ఆరోహణరావు, ఎస్ఐ గౌస్‌బాషా తమ సిబ్బందితో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అక్కడున్న మొక్కలను పరిశీలించి గంజాయి మొక్కలేనని నిర్ధారించారు. దీంతో ఎక్సైజ్, రెవెన్యూ అధికారులను పిలిపించి పంచనామా నిర్వహించారు. కాగా రంగనాథ్ తన కుటుంబంతో కలిసి ధర్మవరంలో నివసిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

యాదవులను ఆదుకుంటాం

సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ


మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న యాదవులను ఆదుకుంటామని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు రా మకృష్ణ అన్నారు. నక్కా రామ్మోహన్‌రావు యాదవ కల్యాణమండపం లో గురువారం యాదవసంఘం నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో యాదవులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి యాదవ ఎంప్లాయిస్ ఫెడరేషన్, యాదవ విద్యార్థి సంఘం, యాదవ మహిళా సంఘం వంటి వాటి వాటిని ఏకతాటిపైకి తెస్తామన్నారు. సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గోపాల్, సీనియర్ నాయకులు నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎంపీడీఓపై వైసీపీ నాయకుడి దాడి


పోలీస్ స్టేషన్ వద్ద ఎంపీడీఓ

రొళ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల ఎంపీడీఓ నాగేశ్వర శాస్త్రిపై వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కవిత భర్త విజయ రంగేగౌడ్ దాడి చేశారు. దీంతో ఆయనపై ఎంపీడీఓ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బిల్లుల విషయమైన గురువారం మధ్యాహ్నం ఎంపీడీఓను ఆయన కార్యాలయంలో విజయ రంగేగౌడ్ కలిశారు. పెండింగ్ బిల్లులను వెంటనే చేయాలని కోరారు. మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసిన తరువాతే బిల్లులు చేస్తామని ఎంపీడీఓ సమాధానం ఇచ్చారు. దీంతో ఆగ్రహానికి గురైన విజయ రంగేగౌడ్.. ఎంపీడీఓను దూషిస్తూ, దాడికి ప్రయత్నించారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయం నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం కారు ఎక్కబోతుండగా ఎంపీడీఓను రంగేగౌడ్ నెట్టేశారు. కిందపడ్డ ఎంపీడీఓ, కాలికి గాయం కావడంతో డ్రైవర్ సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ సుమన్‌కు ఫిర్యాదు చేశారు.

దాడి సరికాదు

పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య

అనంతపురం న్యూటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రొళ్ల ఎంపీడీఓ నాగేశ్వర శాస్త్రిపై దాడి సరికాదని పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్ పేర్కొన్నారు. ఎంపీడీఓపై గురువారం దాడి చేసిన రొళ్ల మండలం మాజీ అధ్యక్షుడు విజయ రంగేగౌడ్‌పై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని ప్రకటణలో డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం.. అధికారులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు


నాగయ్య (ఫైల్)

ధర్మవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేసి మరో ఇద్దరు ఈ లోకాన్ని చూసే వీలు కల్పించారు తమ్మిశెట్టి నాగయ్య(80) కుటుంబ సభ్యులు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన తమ్మిశెట్టి నాగయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. యువర్స్ ఫౌండేషన్ సభ్యులు మృతుడి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి, వారి అంగీకారం మేరకు నేత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రెడ్ క్రాస్ సొసైటీ డీవై కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర, డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతుడి భార్య లక్ష్మీదేవి, కుమారులు కాశీవిశ్వనాథ్, నాగేశ్‌కు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు వైకేశ్రీనివాసులు, డాక్టర్ సుబ్బారావు, లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బత్తలపల్లి, ముదిగుబ్బలో రెండు మద్యం షాపులకు దరఖాస్తులను ఆహ్వానించినట్లు ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బత్తలపల్లిలోని షాపు నెంబరు -13, ముదిగుబ్బలోని షాపు నెంబరు 18లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు రూ.2లక్షలు డీడీ తీసి వాటికి ఆధార్‌కార్డు జతచేసి ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 10 సాయంత్రం 5గంటలలోపు ఆన్‌లైన్ కానీ ఆఫ్‌లైన్‌లో కానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 12న శ్రీసత్యసాయిజిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా తీస్తామని ఆమె తెలిపారు.

ఉత్తమ పొలిటీషియన్‌గా వజ్రకరూరు సర్పంచ్


మోనాలిసా

ఉరవకొండ, నవంబరు6(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ మోనాలిసాకు ఉత్తమ పొలిటీషియన్‌గా గుర్తింపు దక్కింది. ముంబైలో ఈనెల 8, 9 తేదీల్లో ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమోక్రసీ ప్రతినిధులు ఆధ్వర్యంలో జరిగే శిక్షణ తరగతులలో ఆమె పాల్గొననున్నారు. ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. గతంలోనూ ఆమె ఢిల్లీలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నారు.

రైల్వే ఆస్తుల భద్రతను విస్మరించవద్దు

● ఆర్పీఎఫ్ ఐజీ అరోమా సింగ్ ఠాకూర్


ఆర్పీఎఫ్ అధికారులతో మాట్లాడుతున్న ఐజీ అరోమా సింగ్ ఠాకూర్

గుంతకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైల్వే ఆస్తుల రక్షణ బాధ్యతను విస్మరించవద్దని ఆర్పీఎఫ్ ఐజీ ఆరోమాసింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. రైల్వే డివిజనల్ కేంద్రమైన గుంతకల్లులో గురువారం ఉదయం ఆమె తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్, ఆర్పీఎఫ్ బ్యారక్స్‌ను ఐజీ సందర్శించారు. కొన్ని నెలల కిందట ఆర్పీఎఫ్ కార్యాలయానికి సమీపంలోనే రైల్వేకు చెందిన కేబుళ్ల చోరీ కావడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో గుంతకల్లు డివిజనల్ సెక్యూరిటీ కమిషనరు ఆకాశ్‌కుమార్ జైస్వాల్, సహాయ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్లు అనిల్‌కుమార్ సింగ్, రాజ్ గోపాల్ రెడ్డి, స్థానిక ఆర్పీఎఫ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో చురుగ్గా పాల్గొనండి: ఎస్కేయూ వీసీ


మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ అనిత

గుంతకల్లు/టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటూనే క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని ఎస్కేయూ వైస్ చాన్స్‌లర్ అనిత పేర్కొన్నారు. స్థానిక శ్రీ శంకరానందగిరి డిగ్రీ కళాశాలలో ఎస్కేయూ అనుబంధ అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వైస్ చాన్స్‌లర్ అనిత మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కళాశాల కరస్పాండెంటు కేసీ హరి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి జెస్సీ, ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మస్తానప్ప, ఆతిథ్య కళాశాల పీడీ మహబూబ్ బాషా, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

పరిశ్రమకు సబ్సిడీ

పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పాలు, మాంస ఆధారిత ఉత్పత్తుల తయారీ పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రభుత్వం సబ్సిడీని ఇస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులకు ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం ద్వారా 35 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. 10 శాతం లబ్ధిదారుల వాటా, 90 శాతం బ్యాంక్ రుణ సదుపాయం కల్పిస్తారన్నారు. ఈ పథకం కింద పాల ఆధారిత ఉత్పత్తులైన పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి, పన్నీర్, కోవా తీపి పదార్థాలు, మాంసాహార ఉత్పత్తులైన మాంస ఊరగాయలు, ఇతర మాంస ప్రాసెసింగ్ పదార్థాల తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చునన్నారు. ఔత్సాహికులు జిల్లా రిసోర్స్ పర్సన్ హరీశ్ 9676796974 నంబరులో సంప్రదించాలన్నారు. అలాగే జిల్లా ఉద్యాన అధికారి కార్యాలయం, పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో సంప్రదించవచ్చునని తెలిపారు.

కొనసాగిన ఏసీబీ తనిఖీలు

చిలమత్తూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండోరోజు గురువారం కూడా ఏసీబీ సోదాలు కొనసాగాయి. ఏసీబీ అధికారులు హమీద్‌ఖాన్, జయమ్మ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు తనిఖీలు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్‌తో పాటు కార్యాలయంలో పనిచేసే ప్రైవేటు వ్యక్తులు, మరికొందరు దస్తావేజు లేఖరులను వారితో పాటు కార్యాలయంలో ఉంచుకొని రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీల్లో రూ.4060 పట్టుబడగా దాన్ని సీజ్ చేశారు. కార్యాలయంలో పనిచేసే ఓ ప్రైవేటు వ్యక్తి ఫోన్ పే ద్వారా పెద్ద ఎత్తున నగదు లావాదేవీలు జరగడంతో దానిపై ఆరా తీశారు. ఎందుకు అంత పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరిగాయి? సబ్‌రిజిస్ట్రార్‌కి ఈ నగదు వెళ్లిందా? అని ప్రశ్నించినట్లు సమాచారం.


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం తెల్లవారుజామున ఏసీబీ అధికారులు

నేటి ప్రముఖులు


పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సర్ సీవీ రామన్ (జయంతి)



శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ 1888 నవంబరు 7న తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లిలో జన్మించారు. సీ రాజగోపాలాచారి, సర్వేపల్లి రాధాకృష్ణన్‌లతో కలసి భారతరత్న్ అందుకున్న తొలి వ్యక్తి. ఆసియా ఖండంలో సైన్స్‌లో నోబెల్ పురస్కారం అందుకున్న తొలి వ్యక్తికావడం విశేషం. భౌతికశాస్త్రంలో పారదర్శక వస్తువులో 'కాంతి తరంగం' ప్రసరిస్తుందనే అంశంపై ఆవిష్కరణ 'రామన్ ఎఫెక్ట్'గా పేరొందింది. ఆవిష్కరణ రోజును 'నేషనల్ సైన్స్ డే' గా కేంద్ర ప్రభుత్వం ఆచరిస్తోంది. బెంగళూరులో ఏర్పాటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)కు 1933లో తొలి దేశ డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. 1970 నవంబరు 21న కన్నుమూశారు. 2013లో ఆయన 125వ జయంతి గూగుల్ డూడుల్ ఏర్పాటు చేసింది.

ఆచార్య ఎన్‌జీ రంగా (జయంతి)




భారత రైతాంగ ఉద్యమ పితామహగా పేరొందిన ఆచార్య ఎన్‌జీ రంగా 1900 నవంబరు 7న గుంటూరు జిల్లా నిడుబ్రోలులో జన్మించారు. అసలు పేరు గోగినేని రంగనాయకులు. స్వాతంత్ర్య సమర యోధుడు. రైతు కూలీ ఉద్యమానికి నాయకత్వం వహించారు. అంతర్జాతీయ ఉత్పత్తిదారుల సమాఖ్య వ్యవస్థాపకులలో ఒకరు. రాజాజీతో కలిసి కిసాన్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా రాజ్యాంగ రచనలో అనేక సలహా, సూచనలు చేశారు. ఎన్నో స్ఫూర్తిదాయక రచనలు, పుస్తకాలు రాశారు. లోక్‌సభ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగాను వ్యవహరించారు. 1991లో పద్మవిభూషణ్ పురస్కారం అందుకున్నారు. 1995 జూన్ 8న తుదిశ్వాస విడిచారు. ఆయన పేరుతో జాతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించబడింది.

మాస్టర్ కేపీకే (జయంతి)



డాక్టర్ కే పార్వతి కుమార్ (కేపీకే) 1945 నవంబరు 7న విజయవాడలో జన్మించారు. ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్. విశాఖపట్నం, హైదరాబాద్, చెన్నైలలో శాఖలున్నాయి. ఆంధ్రా విశ్వవిద్యాలయం గౌరవ ప్రొఫెసర్‌గా సేవలందించారు. డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్యతో కలసి 18ఏళ్లపాటు పనిచేశారు. సామాజిక సేవలో భాగంగా వందకుపైగా గ్రూపులలో సభ్యుడిగా ఉంటూ 27 దేశాలలో పర్యటించి ధ్యానం, యోగా, ఆస్ట్రాలజీ, హీలింగ్ తదతర అంశాలపై 200 రచనలు చేయడంతోపాటు 500కు పైగా సదస్సులు నిర్వహించారు. 2022 నవంబరు 1న కన్నుమూశారు.

కమల్‌హాసన్ (పుట్టినరోజు)



దక్షిణాది ప్రముఖ నటుడు పద్మభూషణ్ గ్రహీత కమల్‌హాసన్ 1954 నవంబరు 7న జన్మించారు. ఆయన అసలుపేరు పార్థసారథి శ్రీనివాసన్. నటుడు, దర్శకుడిగా, నిర్మాతగా, స్క్రీన్‌రైటర్‌గా, కొరియోగ్రాఫర్‌గా, ప్లేబ్యాక్ సింగర్‌గా లిరిసిస్ట్‌గా, బుల్లితెర హోస్ట్‌గా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించారు. రాజకీయాల్లోనూ సత్తా చాటుకున్నారు. 4 జాతీయ అవార్డులు, 9 తమిళనాడు స్టేట్‌ఫిల్మ్ అవార్డ్స్, 4 నంది, ఒక రాష్ట్రపతి అవార్డు, 18 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. కళైమామణి, పద్మశ్రీ ఇతర గౌరవాలు అందుకున్నారు. ప్రస్తుతం తమిళనాడునుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. మక్కల్ నీదిమయ్యమ్ పార్టీని స్థాపించి రాజకీయాల్లోనూ ఉన్నారు.

ఉషా ఉతుప్ (పుట్టినరోజు)




ఉర్రూతలూగించే హుషారైన పాటలతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ నేపథ్యగాయని ఉషా ఉతుప్ 1947 నవంబరు 7న ముంబైలో జన్మించారు. పాప్, జాజ్, సినీపాటలతో ఆమె ఖ్యాతి గడించారు. చిన్నపిల్లల కథల ఆల్బమ్స్ రూపొందించారు. తనదైన శైలిలో చక్కటి గుర్తింపు పొందారు. 'పద్మశ్రీ' 'మహిళా శిరోమణి పురస్కార్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్' తదితర పురస్కారాలను అందుకున్నారు. బుల్లితెరపై పలు సంగీత కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

త్రివిక్రమ్ శ్రీనివాస్ (పుట్టినరోజు)



కలం పేరు త్రివిక్రమ్ శ్రీనివాస్‌గా పేరొందిన ఆకెళ్ళ నాగ శ్రీనివాస శర్మ 1971 నవంబరు 7న భీమవరంలో జన్మించారు. స్క్రీన్ రైటర్‌గా, డైలాగ్ రైటర్‌గా, దర్శకుడిగా తెలుగు సినిమారంగంలో చక్కటి గుర్తింపు పొందారు. అభిమానులు ఆయనను 'మాటల మాంత్రికుడి'గా అభివర్ణిస్తారు. 'నువ్వే కావాలి'లో మాటల రచయితగా నేషనల్ ఫిలిం అవార్డు,'నువ్వే నువ్వే' చిత్రం నంది పురస్కారాన్ని గెలిచింది. బీఎన్ రెడ్డి నేషనల్ అవార్డుతో పాటు నంది, ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఇతర గౌరవాలు అందుకున్నారు. దర్శకత్వం వహించిన అత్తారింటికి దారేది, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురంలో సినిమాలు బాక్సాఫీస్ హిట్‌గా నిలిచాయి.

అనుష్క శెట్టి (పుట్టినరోజు)



దక్షిణాదిన లేడీ సూపర్‌స్టార్‌గా పేరొందిన నటి అనుష్క శెట్టి కర్ణాటక రాష్ట్రం మంగళూరులో 1981 నవంబరు 7న జన్మించారు. సినీరంగంలో అత్యధిక పారితోషికం తీసుకునే నటి. తెలుగు, తమిళ సినిమాల్లో ప్రముఖ హీరోల సరసన నటించారు. బహుభాషల్లో నిర్మితమైన మెగా హిట్ సినిమా 'బాహుబలి'లో దేవసేనగా నటించారు. అద్భుత నటనకుగాను పలు అవార్డులను సొంతం చేసుకున్నారు. 50కుపైగా సినిమాల్లో నటించి రెండు నంది, ఇంకా 'సినీమా' అవార్డ్స్, తమిళనాడు స్టేట్ ఫిలిం అవార్డ్స్ ఇతర పురస్కారాలు అందుకున్నారు.

దేశీయ అగరబత్తీలతో సంస్కృతితోపాటు ఉపాధి

● అఖిల భారత ఊదిబత్తీల ప్రదర్శన ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె



సదస్సును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి శోభాకరంద్లాజె

బెంగళూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): భారతీయ అగరబత్తి పరిశ్రమ మన సంస్కృతితో పాట చేతివృత్తులకు పారిశ్రామికంగా ఎంతోమందికి ఉపాధిని కల్పించే రంగంగా పేరొందిందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శోభాకరంద్లాజె అన్నారు. ప్యాలెస్ మైదానం త్రిపుర వాసినిలో అఖిలభారత అగరబత్తి ఉత్పత్తిదారుల సంఘం(ఎఐఎఎంఎ) ఏర్పాటు చేసిన ప్రదర్శనలను గురువారం కేంద్రమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ సంప్రదాయికంగానే ఆధునిక అనే నినాదంతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.ఎఐఎఎంఎ అధ్యక్షులు అంబికా గ్రూపు కంపెనీ ఎండీ అంబికా రామాంజనేయులు మాట్లాడుతూ ఎక్స్‌పో పరిశ్రమ ప్రగతిని చాటేలా ఉందన్నారు. అగరబత్తి పరిశ్రమ సుదీర్ఘ ప్రయాణంలో మహత్తరమైన క్షణంగా భావిస్తున్నామన్నారు. తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్‌లు ఒకే ప్రదర్శనకు తీసుకువచ్చినట్లు అయ్యిందన్నారు. ఎక్స్‌పో సమితి అధ్యక్షుడు సైకిల్‌ప్యూర్ ఎండీ అర్జున్‌రంగా మాట్లాడుతూ సంప్రదాయమైన కళను ఆధునిక పరిశ్రమ పద్ధతులతో అనుసంధానం చేసేలా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రదర్శనలను పారిశ్రామిక నిపుణులతో పాటు అనుబంధ ఉత్పత్తిదారులు భాగస్వామ్యులైనట్లు ప్రకటించారు.ప్రదర్శనలు మూడురోజుల పాటు కొనసాగుతాయని ప్రకటించారు.

ఆకట్టుకున్న బ్లూ షో..!

● ఒక చోటకు చేరిన ఫ్రాన్స్, జపాన్ కళాకారులు
● హంపి ఆర్ట్ ల్యాబ్‌లో విదేశీయుల సందడి

బళ్లారి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) ప్రసిద్ధి చెందిన పర్యాటక క్షేత్రం హంపి ల్యాబ్ నీలిరంగులతో దర్శనమిచ్చింది. పురాతన ఇండిగో రంగుకు కొత్త రూపం ఇవ్వాలనే ప్రయత్నంలో ఫ్రాన్స్, జపాన్, భారత్ కళాకారులు ఒకే వేదికపైకి చేరారు. బ్లూ ఫ్యూచర్స్ రీఇమాజినింగ్ ఇండిగో పేరిట జేఎస్ఎస్‌బీయూ, జెఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కళా ప్రదర్శన గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జేఎస్‌డబ్ల్యూ చైర్‌పర్సన్ సంగీత జిందాల్ నాయకత్వం వహించారు. అమె రూపొందించిన ఈ ప్రదర్శనలో, భారతీయ సంప్రదాయ రంగుల పునరుజ్జీవనంచ ఆధునిక కళా, స్థిరత్వం అన్న మూడు కోణాలు కలిశాయి. నీలి రంగు కేవలం రంగుమాత్రమే కాకుండా గుర్తింపు సహనం, పునరుత్థానం ప్రతీకగా మలిచారు. ముంబైకి చెందిన శిల్పి మనీష్‌నాయ్, ఫ్రాన్స్ మాలీకి చెందిన ఇండిగో మాస్టర్ అబూబకర్, జపాన్‌కు చెందిన కళా సమష్టి బుయ్యో స్టూడియో, అల్వార్ బాలసుబ్రహ్మణ్యం వంటి అంతర్జాతీయ కళాకారులు తమసృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంగీత జిందాల్ మాట్లాడుతూ హంపి ఆర్ట్ ల్యాబ్ సంప్రదాయం అవిష్కరణల మధ్య కొత్త సంభాషణాలకు వేదిక అని భారత నేలలో పుట్టిన ఈ నీలిమ రంగు ప్రపంచ సృజనాత్మకతకు ప్రతీకగా మారిందన్నారు. హంపి ఆర్ట్ ల్యాబ్ రెసిడెన్సీ డైరక్టర్ మీరా కురం మాట్లాడుతూ సందర్శకులు ఇండిగోను సజీవ కథగా మారుతున్న ప్రపంచ ప్రతిబింబంగా అనుభవించే స్థలమే ఇది అని వివరించారు. ఇండిగో పావిలియన్ కేంద్రంగా రూపొందించిన ఈ ప్రదర్శనలో నీలిరంగు బట్టలు మృదువైన కాంతుల్లో ప్రవహిస్తూ అద్భుత దృశ్యాలు ఆవిష్కరించాయి. పురాతన రంగు తయారీ ప్రక్రియను డై వ్యాట్ ఇన్‌స్టాలేషన్ రూపంలో చేపించారు. ప్రపంచవ్యాప్తంగా ఇండిగో ప్రయాణాన్ని తెలియాడే ప్యానెల్‌లు, డిజిటల్ మ్యాప్‌లు ప్రత్యక్ష మొక్కలతో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇండిగో వర్క్‌షాపులు, బ్లాక్ ప్రింటింగ్ ప్రదర్శనలు, కళాకారుల చర్చలు, సినిమాల ప్రదర్శనలు కూడా నిర్వహించారు. హంపి సమీపంలోని తొమ్మిది ఎకరాలలో ఈ సౌకర్యం కళ వారసత్వం, ప్రకృతిని కలిపిన అద్భుత ప్రదేశంగా నిలిచింది. విజయనగర సామ్రాజ్యపు కళా వైభవం స్ఫూర్తిగా జెఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ దీన్ని అభివృద్ధి చేసిందని ఈ కేంద్రం ప్రపంచ బంధాలను బలోపేతం చేస్తోందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.



ఫ్రాన్స్, జపాన్ కళాకారులతో మాట్లాడుతున్న సంగీత సింధాల్



డిజైన్‌ను ప్రదర్శిస్తున్న ప్రతినిధులు



సంతకం చేసి నిరసనను ప్రారంభిస్తున్న అధికారి అంబరీశ్ ఆదోని

ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరుతూ

సంతకాల సేకరణ

రాయచూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్య తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని ఏఐడీవైఓ జిల్లా అధ్యక్షుడు చన్నబసవ జానేకల్ డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీతో పాటు నిరుద్యోగ సమస్య పరిష్కారం కోరుతూ ఏఐడీవైఓ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టారు. సంతకాలు చేస్తు ఉద్యమాన్ని రిటైర్డ్ బ్యాంక్ అధికారి అంబరీశ్ ఆదోని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చన్నబసవ జానేకల్ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన ఉద్యోగ ఖాళీలు 9.79 లక్షలు కాగా వాస్తవానికి ఆ సంఖ్య దాదాపు 30 లక్షలకు పైగా ఉంటుందన్నారు. ఒక్క కల్యాణ కర్ణాటక ప్రాంతంలోనే 22 వేల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, రాయచూరు జిల్లాలో 5 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాది అవకాశాలు ఉద్యోగ అవకాశాలు కోరుతూ ఏఐడీవైఓ నిరంతర పోరాటాలు సాగిస్తుందన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీదేవి పండుగ



అలంకరణలో గౌరీదేవి



చక్కెర హారతులు ఇస్తున్న బాలిక

సిరుగుప్ప, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గౌరిదేవి పూజలను మహిళలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా మహిళలు దేవికి చక్కెర హారతులు, దీపాలతో పూజలు చేశారు. టపాసులు భారీ ఎత్తున పేల్చారు. సిరుగుప్ప పట్టణంలో ప్రధానంగా ఆదోని రోడ్డు మార్గంలో ఈశ్వర దేవాలయంలో ఉమామహేశ్వరాలయంలో సదాశివనగర్, విజయవిఠల్ నగర్, బసవేశ్వర నగర్‌లో గౌరీదేవిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి తర్వాత గౌరిపండగ జరుపుకోవడం ఆనవాయితీ.

ఆశలు కంది పాయె..!

● రసం పీల్చే వైరస్‌తో ఏర్పడిన గొడ్డు చెట్లు
● పూత, కాయలు కాసే పరిస్థితి మృగ్యం
● మరికొన్ని పొలాల్లో కాయపుచ్చు తెగులు
● ప్రశ్నార్థకంగా కంది దిగుబడి
● ఆందోళనలో రైతులు

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. వేరుశనగలో ఎక్కువ నష్టాలు వస్తుండటంతో ఈ ఏడాది అనేకమంది రైతులు ప్రత్యామ్నాయంగా కందిని సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 3.5 లక్షల ఎకరాలకుపైగా భూమిలో వర్షాధారం కింద కంది పంట సాగైంది. పైరు ఏపుగా పెరిగినా చీడపీడలతో దిగుబడిపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రసం పీల్చే వైరస్ సోకడంతో గొడ్డు చెట్లు ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల మారుక మచ్చల పురుగు ఆశించడంతో పంట దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో కంది రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

గొడ్డు చెట్లు దర్శనం

ఈ ఏడాది జూన్, జూలై మాసంలో సాగు చేసిన కంది పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. పంట శాకీయ దశలో ఉన్న సమయం సెప్టెంబరు నుంచి అక్టోబరు మధ్యలో సరైన వర్షాలు పడలేదు. వాతావరణం కూడా వేడిగా ఉండటంతో రసం పీల్చే వైరస్ సోకింది. దీంతో కంది మొక్కలు పూత పూయని గొడ్డు దశకు చేరాయి. వీటి వల్ల రైతులకు తీవ్ర నష్టం ఏర్పడింది. అలాగే మారుక గూడు పురుగు సోకడంతో కాయపుచ్చు ఏర్పడింది. ఈ పురుగు సోకడంతో మొక్కల్లో ఎదుగుదల లోపించింది. ఈ పురుగు లేత ఆకులు, అప్పుడే ఏర్పడిన పూత మీద గుడ్లను పెడుతుంది. గుడ్ల నుంచి పొదిగిన లార్వాలు ఆకులు, పూతను గూడుగా చేసుకొని, అందులో ఉన్న పచ్చదనాన్ని తింటాయి. తద్వారా పూత రాలిపోతుంది. కాయ ఎదుగుదల లోపిస్తుంది. ఈ పురుగు సోకిన కంది పంట దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. దీంతో రైతులకు ఆవేదన తప్పడం లేదు.



బెళుగుప్ప మండలంలో కంది పంట



బెళుగుప్ప మండలంలో కంది గొడ్డుచెట్లు

దిగుబడి కష్టమే



ఈ సారి ఖరీఫ్‌లో 28 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. మారుక గూడు పురుగు సోకడంతో కాయపుచ్చు ఏర్పడింది. దీంతో పూత రాలిపోతోంది. మరికొన్ని చెట్లకు రసం పీల్చే వైరస్ సోకడంతో గొడ్డు చెట్లు ఏర్పడ్డాయి. తద్వారా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. వేరుశనగ సాగుతో నష్టపోయి కంది పంటను సాగు చేశా. అయితే తెగుళ్లు సోకవడంతో కంది పంట దిగుబడి కూడా వస్తుందో..? రాదో తెలియని పరిస్థితి ఏర్పడింది.

- రైతు శ్రీరాములు,
ఆవులెన్న, బెళుగుప్ప మండలం

పూత రాలిపోతోంది



నేను 10 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. తెగుళ్ల సోకడంతో కంది పంటలో పూత రాలిపోతోంది. దీనికి తోడు వర్షాలు పడుతుండటంతోతెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేయలేకపోతున్నాం. ఆకాశం ముసురుగా ఉండటంతో తెగుళ్ల ఉధృతి కూడా పెరిగింది. వేరుశనగలో నష్టాలు వస్తున్నాయని కంది సాగు చేస్తే ఇందులో కూడా నష్టాలే మిగిలేలా ఉన్నాయి.

- రైతు వెంకటేశులు, నక్కలపల్లి,
బెళుగుప్ప మండలం

సస్యరక్షణ చర్యలు అవసరం



ఈ సారి ఖరీఫ్‌లో సాగైన పంటలో ఎక్కువ శాతం రసం పీల్చే నల్లి ద్వారా వైరస్ సోకడంతో గొడ్డు చెట్లు ఏర్పడ్డాయి. పలు ప్రాంతాల్లో కందికి మారుక గూడు పురుగు సోకడంతో కాయపుచ్చు ఏర్పడింది. దీంతో కంది పూత రాలిపోతోంది. కాయ ఎదుగుదల కనిపించడం లేదు. పొలంలో ఇతర కంది మొక్కలకు ఈ తెగుళ్ల వ్యాప్తి చెందకుండా తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. ఈ తెగుళ్ల నివారణ కోసం 80 గ్రాములు ఇమామెక్టిన్ బెంజోయేట్ , 80 మి.లీల క్లోరంత్రానిల్లి ప్రోల్‌లను పిచికారీ చేసుకోవాలి.

- చంద్రాయుడు, కేవీకే శాస్త్రవేత్త, కళ్యాణదుర్గం

బాలుడికి అరుదైన చికిత్స

బెంగళూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన కడుపునొప్పితో పాటు వాంతుల ద్వారా ప్రమాద స్థితికి చేరిన 16 ఏళ్ళ బాలుడిని మెడికేర్ వైద్యులు అత్యవసర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఇదే విషయమై సర్జన్ వంశీకృష్ణ గురువారం తెలిపిన మేరకు బాలుడి కడుపులో అసహజంగా ఉబ్బినట్లు గుర్తించి సిటీ స్కాన్ చేశామన్నారు. మిడ్‌గట్ మాల్రోటేషన్ అనే అరుదైన సమస్య ఉన్నట్లు నిర్ధారించామన్నారు. పేగులు శిశువులలో మార్పులు జరుగుతాయని అవి తద్విరుద్ధంగా తిరిగితే ప్రమాద సంకేతమే అన్నారు. ఆపరేషన్ సకాలంలో చేయడం ద్వారా బాలుడిని రక్షించినట్లు డాక్టర్ తెలిపారు.

హైవేపై ఆపితే.. సైరన్ మోగుద్ది..!

● అన్ విజిబుల్ లేజర్ రేస్‌తో పసిగట్టే పరికరాలు
● రెండు నిముషాలు దాటితే సైరన్
● అనంతలో ప్రయోగాత్మకంగా అమలుకు అడుగులు

అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై, పక్కన పార్కింగ్ చేసిన వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగి పలువురు చనిపోతుంటారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినపుడు రోడ్ల పక్కన నిలిపి ఉంచిన వాహనాలను వెంటనే గుర్తించి, అక్కడి నుంచి వెళ్లిపోయేలా చేస్తే.. ప్రమాదం జరిగేది కాదు అనుకుంటుంటాం. ఆ దిశగా పోలీసు శాఖ అడుగులు వేస్తోంది. కేవై సొల్యూషన్స్ సంస్థతో కలిసి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు సరికొత్త పరికరాల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. రోడ్లపై ఆగి ఉన్న వాహనాలను లేజర్ సెన్సర్ ద్వారా గుర్తించే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలులోకి తీసుకురానుంది.

ప్రమాద ప్రాంతాల గుర్తింపు

జిల్లా పోలీసు శాఖ.. కేవై సొల్యూషన్స్ సంస్థతో కలసి యాంటీ పార్కింగ్ లేజర్ సెక్యూరిటీ సిస్టం పరికరాలను రహదారుల వద్ద అమర్చుతారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. వాటి లేజర్ సిగ్నల్స్ ఆధారంగా వాహనాలను గుర్తిస్తారు. ఎక్కడైనా రోడ్డుపై లారీలు, కంటైనర్లు ఇతర వాహనాలు నిలిపి ఉంచినా... కదలకుండా అలాగే ఉన్నా.. లేజర్ సెన్సర్ కిరణాలు వాటిపై పడతాయి. వాటి ఆధారంగా సమాచారం క్షేత్రస్థాయిలోనే కాకుండా పోలీసు ఉన్నతాధికారులకు కూడా చేరుతుంది. తద్వారా వాటిని అక్కడి నుంచి పంపించే అవకాశం ఉంటుంది. దీంతో ప్రయోగాత్మకంగా వీటి ఏర్పాటుకు పోలీసు శాఖ పరిశీలిస్తోంది. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు, డీటీఆర్సీ సీఐ విజయభాస్కర్, రాప్తాడు సీఐ హర్ష, కేవై సొల్యూషన్స్ ప్రతినిధి శ్రీధర్.. 44వ జాతీయ రహదారిపై జిల్లా కేంద్రంలోని తపోవనం సర్కిల్, హైదరాబాద్ చాయ్ వద్ద, రాప్తాడు జంక్షన్ తదితర ప్రాంతాలను పరిశీలించారు.

వెంటనే సమాచారం

యాంటీ పార్కింగ్ లేజర్ సెక్యూరిటీ సిస్టం పరికరాలు ఏర్పాటుచేసిన సర్కిల్‌లోగానీ, ప్రాంతంలోగానీ వాహనాలు పార్కింగ్ చేస్తే వెంటనే లేజర్ సెన్సర్ కిరణాలు వాటిపై పడతాయి. ఫీల్డ్ అలర్ట్ వస్తుంది. 2 నిముషాల కన్నా ఎక్కువసేపు పార్కింగ్ చేస్తే వెంటనే వాయిస్ అలర్ట్ వస్తుంది. పోలీసు సైరన్ కూడా మోగుతుంది. ఆ ఏరియాకు సంబంధించిన పోలీసు అధికారులు సుమారు ఐదుగురికి ఎస్ఎంఎస్‌లు, ఫోన్ కాల్స్ రూపంలో సమాచారం వెళ్తుంది. స్థానికంగా ఫీల్డ్ అలర్ట్ రావడంతో ఆ ప్రదేశానికి చేరుకున్న (ప్రయాణం చేసే వారికి) వాహన చోదకులు అప్రమత్తం అయ్యే అవకాశం ఉంటుంది. పోలీసులకు సమాచారం వెళ్లిన వెంటనే.. అధికారులు అప్రమత్తమై పార్కింగ్ చేసిన వారిని అలర్ట్ చేస్తారు. వాహనాన్ని పంపించేసి, ప్రమాదాలను అరికట్టే అవకాశం ఉంటుంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.04	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	9,078	15,536
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,510	15,116
నీటి నిల్వ (టీఎంసీలు)	79.93	101.77

ఉద్యోగాల భర్తీలో నిర్లక్ష్యం వీడండి

● రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధం: ఏఐడీవైఓ ● నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు సోమశేఖర్ గౌడ

బళ్లారి సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఇప్పటికైనా నియామకాలు చేపట్టాలని గురువారం ఏఐడీవైఓ ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఏఐయూటీయూసీ ఆర్గనైజేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్ సంతకం చేసి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య భయానకంగా మారుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని 78మంత్రిత్వశాఖలు, విభాగాల్లో 9.78 లక్షలకు పైగా ఖాళీలున్నాయన్నారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో పరిస్థితి ఇలాగే ఉందన్నారు. రాష్ట్రంలో యువతకు ఏటా 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ హామీని పెడచెవిన పెట్టిందన్నారు. పెరుగుతున్న ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని, వారి బలం, సామర్థ్యం ప్రకారం అందరికీ ఉపాధి కల్పించాలన్నారు. నిరుద్యోగం, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం కారణంగా యువతలో మానసిక నిరాశ, కటుంబ సంబంధాల్లో చీలికలు పెరుగుతున్నాయన్నారు. ఏఐడీవైఓ జిల్లాధ్యక్షుడు పంపాపతి మాట్లాడుతూ నిరుద్యోగ భారంతో ఏటా ఎందరో యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. 2023లో యువత ఆత్మహత్యల సంఖ్య 14,234కి పెరిగిందన్నారు. ఈపోరాటం యువతను ఈ సమస్యల నుండి రక్షించడానికి , సామాజిక నిర్మాణాన్ని కాపాడటానికిఅని అన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేసి ప్రభుత్వాలు మాట నిలబెట్టుకోవాలన్నారు. అన్ని నియమాకాల వయోపరిమితిలో కనీసం 5సంవత్సరాలు సడలింపు ఇవ్వాలని, అన్ని రకాల నియామక ప్రక్రియలలో పూర్తి పారదర్శకత ఉండాలన్నారు. పరీక్షల్లో అక్రమాలను నివారించాలని, కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పోస్టులకు శాశ్వత నియామకాలు చేయాలి. దేశవ్యాప్తంగా గిగ్ కార్మికులను కార్మికులుగా పరిగణించాలి, కనీస వేతనాలు, సామాజిక భద్రతను కల్పించాలన్నారు. ఉద్యోగ అవకాశాలు లభించే వరకు గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి తగిన నిరుద్యోగ భృతిని అందించాలన్నారు. ప్రభుత్వసంస్థ ప్రైవేటీకరణను రద్దు చేయాలి. నియామకాలలో ఖరీదైన పరీక్ష రుసుములను రద్దు చేయాలి. పరీక్షలకు ఉచిత రవాణా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి జగదీశ్ నేమకల్, సభ్యులు సిద్ధూ, ప్రమోద్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ కవితా మన్నికేరి

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

● ఉపాధ్యాయులకు కలెక్టర్ మన్నికేరి ఆదేశం

బళ్లారి సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా చూడాలని, రక్తహీనత, ఇతర పౌష్టికాహార లోపాలను పరిష్కరించవడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతిష్టాత్మక పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ కవితా మన్నికేరి అన్నారు. గురువారం నగరంలోని పుణ్యమూర్తి రాఘవ శెట్టి ప్రభుత్వ మోడల్ హయ్యర్ ప్రైమరీ స్కూల్లో గనుల ప్రభావిత ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాల పిల్లలకు పోషకాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక దార్శనికత కారణంగా 4గనుల ప్రభావిత జిల్లాల్లోని 10తాలూకాలలోని ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పోషకాహార పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేయడం జరిగిందని అన్నారు.దీని వల్ల పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రభుత్వం పాఠశాల పిల్లల ఆరోగ్యం, విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం గమనార్హం అని అన్నారు. జిల్లా పంచాయతీ సీఈఓ నోంగ్‌జోయ్ మహ్మద్ ఆలీ అక్రమ్ షా , మున్సిపల్ కౌన్సిల్‌లోని 31వ వార్డు సభ్యుడు తరిహళ్ళి జంబునాథ్, డీడీపీఐ వెంకటేశ్ రామచంద్రప్ప, బీఈఓ శేఖరప్ప హొరపేట, ఎస్‌డీఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

● మరో బాలుడి ఆచూకీ కోసం గాలింపు
● కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు



కిరణ్ (ఫైల్)

బళ్లారిరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పరమదేవనహళ్లి పోలీస్ స్టేషన్ పరిధి హగరి వేదవతి నదిలో మంగళవారం ఇద్దరు బాలురు గల్లంతయిన సంగతి తెలిసిందే. రెండు రోజులుగా పోలీసులు నదిలో గాలింపు చేపట్టారు. గురువారం సాయంత్రం కిరణ్ (16) బాలుడి మృతదేహం లభ్యం కావడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టమ్ నిర్వహించారు. మరో బాలుడి కోసం నదిలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

రేపు కనకదాస జయంతి

సిరుగుప్ప, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): భక్త కనకదాస జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గౌసియాబేగమ్ తెలిపారు. గురువారం విలేఖరులతో ఆమె మాట్లాడుతూ 8వ తేదీ భక్త కనకదాస జయంతి వేడుకలను హైస్కూలు గ్రౌండ్ నుంచి తాలుకా పంచాయతీ వరకు ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పంచాయతీభవనంలో వేదిక కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బీఎం నాగరాజు ఆధ్వర్యంలో జరుపుతున్నట్లు తెలిపారు. నగరసభ అధికారులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సంఘ సంస్థల పదాధికారులు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పురసభ భవన నిర్మాణానికి ఎంపీ భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీ తుకారాం

తోరణగల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కురేకుప్ప పురసభ నూతన కట్టడం కట్టడానికి భూమిపూజ నిర్వహించిన ఎంపీ తుకారాం అలాగే ప్రభుత్వ పని దేవుని కార్యమని పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని సిపారంలో ఎనిమిది ఎకరాల స్థలంలో పురసభ నూతన భవన నిర్మాణానికి ఎంపీ భూమిపూజ నిర్వహించి మాట్లాడారు. నూతన పురసభ భవనానికి బస్టాండుకు, అలాగే మార్కెట్‌కు మొదలగు కార్యక్రమాలకు ఈ స్థలానికి కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. రూ. 3.96 కోట్లు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఇక్కడ రాజకీయాలకు పార్టీలకతీతంగా అందరూ కలసికట్టుగా అభివృద్ధి పనులు చేస్తున్నామని కాలువల నిర్మాణానికి, రోడ్లు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాల, నిరుపేదల గృహాలు, హాస్టళ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే మౌళిక సదుపాయాల కల్పన కూడా చేపడుతున్నామన్నారు. సండూరులో రూ.74 కోట్ల కౌసల్య కేంద్రం ఏర్పాటు చేయడానికి అనుమతులు వచ్చాయని, తోరణగల్లు వద్దు కురేకుప్ప ధరోజీ బసాపురంకు రూ.96 కోట్లతో తుంగభద్ర నీరు అందించడం జరుగుతుందన్నారు. 1500 గృహాలు నిరు పేదలకు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్‌ఎల్ స్వామి, సోమప్ప, కల్లుడప్ప, జ్యోతి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గౌరీదేవి పూజలకు సర్వం సిద్ధం



గౌరీదేవి విగ్రహాలను సిద్ధం చేస్తున్న కళాకారులు

కంప్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గౌరీ పండగ సందర్భంగా చక్కెర బొమ్మలు మట్టి విగ్రహాల అమ్మకాలు జోరుగా వ్యాపారం కొనసాగుతుంది. గ్రామీణ సౌందర్యానికి ప్రతిబింబం గౌరీ పండగ కార్తీక మాసంలోని గ్రామీణ సౌందర్యాన్ని ప్రతిబింబించే బాలికలకు ఆనందాన్ని కలిగించే గౌరీ పౌర్ణమిని నేడు జరుపుకుంటున్నారు. గౌరీని పార్వతి దేవి ప్రతిరూపంగా పూజిస్తారు. దీని కోసం పట్టణంలోని చిత్రకారుల కుటుంబాలలో గ్రామీణ ప్రాంతాల్లో మట్టి గౌరీ బొమ్మలను తయారు చేస్తున్నారు. మరో వైపు, చక్కెర బొమ్మల తయారీ, అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. స్థానిక కళాకారులు తయారు చేసిన వివిధ పరిమాణాలు గౌరీ విగ్రహాల అమ్మకాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరోవైపు చక్కెర హారతులు ఉపయోగించి చక్కెర సిరప్‌తో తయారు చేసిన గౌరీ దేవి విగ్రహాలు, గణేశుడు, కంప్లి పట్టణంలోని చిత్రకారుడి కుటుంబానికి పెద్ద అయిన సుమితమ్మ, పరశురామప్ప, చిత్రకారుడు, కుటుంబ గౌరీదేవి విగ్రహాన్ని చిత్రీకరించడానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. గౌరీదేవి విగ్రహాలని నవంబరు 4 నుంచి 6 వరకు మఠాలు, దేవాలయాలు, పూజారులు కొన్ని ప్రదేశాలలో సన్యాసులు, బ్రాహ్మణులు వంటి గ్రామ నాయకుల ఇళ్లలో ప్రతిష్ఠిస్తారు. మహిళలు, పిల్లలు కొత్త బట్టలు ధరించి వెడల్పాటి ప్లేట్లలో వుంచుతారు. ఊరేగింపులో చక్కెర బొమ్మలను చక్కగా అమర్చి దీపాలను వెలిగించి హారతి ఇవ్వడం ఆచారం. పిల్లలు టపాసులు కాల్చి గౌరీ విగ్రహం ప్రతిష్ఠించిన ప్రదేశానికి చేరుకుని భక్తితో హారతి ఇచ్చి గౌరవిస్తారు. నవంబరు 6వ తేదీ రాత్రి గౌరీ దేవి గురించి జానపద పాటలు పాడతారు. గౌరీ విగ్రహాలను గొప్ప వైభవం, ప్రదర్శనతో నదులు బావులలో నిమజ్జనం చేస్తారు. గౌరీ పండుగలో భాగంగా కంప్లి ప్రధాన వీధిలో చక్కెర బొమ్మల అమ్మకం భారీ విజయాన్ని సాధించింది. ఈ పండుగ వివిధ రకాల వంటకాలు నవంబరు 7న సాయంత్రం చాలా గ్రామాలలో ముఖ్యంగా రామసాగరంలో అన్ని గృహాలలో తమ ఇళ్ల పైకప్పుపై కొంతి దేవత విగ్రహాన్ని ఏర్పాటు చేసి కంతి రొట్టె పండుగను జరుపుకుంటారు. నువ్వుల పూత పూసిన జొన్న, సజ్జె రోటి వంకాయ స్కాలియస్‌తో తయారు చేయబడింది. వృద్ధుల నుంచి చిన్న పిల్లల వరకు అందరూ టపాసులు పేల్చి సంబరాలు చేసుకుంటారు.

పౌరాణిక నాటకాలకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న గ్రామస్థులు

కంప్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ భాగాల్లో జరుపుకునే పౌరాణిక నాటకాలకు యువతరం ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. గౌరీదేవి పండగ వీరభద్రేశ్వరాలయం వార్షికోత్సవం సందర్భంగా నంబర్2 ముద్దాపురంలో బుధవారం రాత్రి వీర అభిమన్యు పౌరాణిక నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పండుగ వేడుకలు సందర్భంగా ఇలాంటి పౌరాణిక నాటకాలు ప్రదర్శించడం వల్ల గ్రామ ప్రజల్లో ఐక్యత పెరిగి గ్రామం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి అప్పుడే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతాయని సూచించారు. కంప్లి నియోజకవర్గంలో ఏ గ్రామంలో చూసిన పండుగ వేడుకలు సందర్భంగా ఏదో ఒకటి పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తూ గ్రామాల్లో ఆకట్టుకుంటున్నారని తెలిపారు. పౌరాణిక నాటకం సమితి నుండి ఎమ్మెల్యేకు అభినందించి సన్మానించారు. వారితో పాటు గ్రామప్రముఖులు పౌరాణిక నాటకం సమితి సభ్యులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి: ఏబీవీపీ



గడిగ చెన్నప్ప సర్కిల్లో నిరసన తెలుపుతున్న ఏబీవీపీ కార్యకర్తలు

బళ్లారి సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను ప్రభుత్వం ఆలకించి తక్షణ పరిష్కారాలను అందించాలని డిమాండ్ చేస్తూ నవంబరు 6న భారీ ప్రతిఘటన చేపడుతున్నట్లు జిల్లా సంచాలకులు దిలీప్ కుమార్ అన్నారు. గురువారం నగరంలోని గడిగిచెన్నప్ప సర్కిల్లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి వెన్నెముకలాంటి రైతుల శ్రేయస్సు కోసం పనిచేయాలని, రైతులు పండించిన పంటలకు సరైన ధర లభించకపోవడంతో నేడు అన్నదాత విలవిలలాడుతున్నారన్నారు. రైతులు తమ పంటలను పండించడానికి ఉపయోగించే ఎరువుల ధరలు పెరిగిపోవడంతో అన్నదాత కు తీవ్ర కష్టాలు తప్పడం లేదన్నారు. సంవత్సరంపాటు చాలా ఖర్చుచేసి పండించిన పంటలకు సరైన ధర లభించపోవడంతో వారు నష్టాలపాలవుతున్నారన్నారు. రైతుల పిల్లలకు ప్రయోజనం చేకూర్చే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు విద్యా నిధిని ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేడయం అన్యాయం అన్నారు. మనసామాజిక జీవితం, ఆర్థిక వ్యవస్థ ప్రతిదీ వ్యవసాయంపై ఆధారపడి ఉంటుంది. రైతులు తమ పంటలకు సరైన ఆదాయం పొందనప్పుడు అది అన్ని ఇతర రంగాలను ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా రైతు పిల్లల విద్య వివాహం,వ్యాపారం అన్నీ ప్రభావితమవుతాయి. ఇప్పటికీ పేదరికం కారణంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈసందర్భంగా జిల్లా ఆర్గనైజింగ్ టీ.భరత్, నగర కార్యదర్శి ఆంజనేయ, కార్యకర్తలు మారుతీ, దర్శన్, వంశీ,శశికళా,నందిని, మహేశ్, ప్రజ్వల్, రోహిత్,వినోద్ ఇతరులు పాల్గొన్నారు.

అనాథలకు అమ్మా.. నాన్నలా..!



నామకరణ వేడుకల్లో సిబ్బంది, అధికారులు

రాయచూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలల సంరక్షణ వేదిక అధికారిక దత్తత స్వీకార సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఇద్దరు అనాద శిశువులకు అధికారికంగా శాస్త్రోత్తంగా నామకరణ మహోత్సవం నిర్వహించారు. రెండు మాసాల క్రితం దేవదుర్గ తాలూకాలో ఒక ఆడ శిశువు కల్మ లా సమీపంలో మరొక మగ శిశువు రోడ్డుపైపడి ఉండడాన్ని గమనించి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు అందించారు. అక్కడికి వెళ్లిన అనాద బాలల సంరక్షణ వేదిక ప్రతినిధులు బాలలిద్దరిని తమ కేంద్రానికి తరలించి వైద్య చికిత్సలందించి ఆలన పాలన తామే నిర్వహించారు. ఈ క్రమంలో బాలలకు గురువారం శాస్త్రోత్తంగా పండుగ వాతావరణంలో నామకరణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బాలల సంరక్షణ అధికారి అమరేశ హావిన బాలలకు నామకరణం చేసి సంబంధిత సంస్థ ప్రతినిధులను ప్రశంసించారు.

హోసూరు జోన్

వరద సహాయక చర్యలపై అవగాహన కల్పించాలి

● కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

హోసూరు(కృష్ణగిరి) నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వరద సహాయక చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు కలెక్టర్ దినేష్ కుమార్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో అగ్నిమాపక శాఖ రిహార్సల్స్‌పై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో వరదలు వచ్చే ప్రాంతాలను అధికారులు పరిశీలించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వారికి ఆహారం, వైద్య సౌకర్యాలు, తాగునీటి, విద్యుత్, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలన్నారు. వరదలు వచ్చే ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. అంటు వ్యాధులు వ్యాప్తిచెందకుండా తాగునీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. దోమల నివారణ మందులు పిచికారీ చేయాలన్నారు. జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురళ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కవిత, అటవీ అధికారి పఖాన్, జగదీష్ సుధాకర్, హోసూరు కార్పొరేషన్ కమిషనర్ మహ్మద్ షబ్బీర్ ఆలం, సబ్ కలెక్టర్ ఆకృతిశెట్టి, ప్రాజెక్టు డైరెక్టర్ పెరియస్వామి పాల్గొన్నారు.

ముందుకు కదలని నీరు.. ప్రజలకు ఇబ్బందులు



ఆసుపత్రి వద్ద నిలిచిన వర్షపు నీరు

హోసూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా కృష్ణగిరిజిల్లాలోని హోసూరులో నిరంతరం వర్షాలు కురుస్తుండటంతో రోడ్లపై నీరు నిలుస్తున్నాయి. ఈ పరిస్థితిలో గురువారం మధ్యాహ్నం వర్షం కురవడంతో బస్టాండు ఎదురుగా ఉన్న రోడ్డు, బాగలూరు రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు చేరి చెరువులా మారింది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, కార్మికులు పడరాని పాట్లు పడ్డారు. మున్సిపల్ అధికారులు స్పందించి నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలకు కిచెన్ సెట్లు అందజేసిన ఎమ్మెల్యే నారా



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారిరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని 11వ వార్డు తదితర ప్రాంతాల్లో గురువారం సిటీ ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి కిచెన్‌సెట్లు పంపిణీ చేశారు. తన జన్మదినం సందర్భంగా అందరికీ సెట్లు అందజేస్తానని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈమేరకు ఆయన స్వయంగా ఇళ్ల వద్దకు వెళ్లి మహిళలకు కిచెన్‌సెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి మహిళల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్, సోమప్ప, మడివాళప్ప, కాంగ్రెస్ నాయకులు ప్రభంజన్, మహేష్, వెంకటేష్ హెగ్డే, నూర్ మహమ్మద్, మించు శ్రీనివాస్, వన్నప్ప, హగరి గోవిందు, సుబ్బరాయుడు, ఛానాల్ స్టేటస్ శివ, రఘు, భరత్, పద్మ, కవిత, గౌతమ్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వరద అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం

బళ్లారిరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం శివాలయాలు కిటకిటలాడాయి. నగరంలో వెంకటేశ్వర నగర్‌లో వెలసిన వరద అభయాంజనేయ స్వామి ఆలయంలో రాత్రి భక్తులు విశేషంగా తరలివచ్చి దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. ఈ దీపోత్సవ కార్యక్రమానికి నగర ప్రముఖులు, మహిళలు, యువకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రస్తవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ తెలిపారు. ఉపాధ్యక్షుడు పీఎం నటరాజు, సభ్యులు శ్రీరాములు, నగేష్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, ముల్లంగిరి, హరీష్, జంబు, వీరేష్, రాజు, సత్తిబాబు, లోకరాజు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు విశేషంగా తరలివచ్చారు. రాత్రంతా దీపోత్సవం కొనసాగింది.





శివలింగం, స్వస్తిక్ ఆకారాల్లో దీపాలు వెలిగించిన భక్తులు



పూజల్లో పాల్గొన్న భక్తులు